ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఫిబ్రవరి 2024





మాట్లాడుతున్న గౌరు చరిత

బహిరంగ విచారణకు సిద్ధం

● కాటసాని సవాల్‌ను స్వీకరించిన గౌరు దంపతులు ● దూపాడులో 12 ఎకరాల భూమిని కాజేసింది వాస్తవం కాదా? ● ఎన్‌ఆర్‌ఐకు చెందిన భూమిలో నీ బినామీలు బోర్డు పాత లేదా ● మరోసారి ప్రశ్నలు సంధించిన టీడీపీ నేతలు

కల్లూరు, ఫిబ్రవరి 3: నాలుగు రోజుల క్రితం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విసిరిన సవాల్‌కు గౌరు దంపతులు ప్రతి సవాల్ విసిరారు. శనివారం నగరంలోని గౌరు దంపతులు వారి స్వగృహంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతే కాటసాని అక్రమాలపై బహిరంగ విచారణకు తాము సిద్ధమని అన్నారు. దూపాడు సర్వే నెంబరు 139లోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన 12 ఎకరాల విలువైన భూమి కాజేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లక్ష్మీపురం సర్వే నెంబరు 789లోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న వెంచర్‌లోని పేదలకు చెందిన 162 ప్లాట్లు దాదాపు 5.80 ఎకరాల భూమిని కాటసాని బినామీలు అన్యాక్రాంతం చేయలేదా అని నిలదీశారు. తహసీల్దారు ఆ భూమి పేదలకు చెందినదని క్లియర్ రికార్డు ఇస్తే వారిని ఇబ్బందులకు గురి చేయలేదా అని అన్నారు. కల్లూరు సర్వే నెంబరు 603లోని ప్లాట్ నెంబరు 87లో ఎన్‌ఆర్‌ఐకి చెందిన భూమిలో పాణ్యం ఎమ్మెల్యే బినామీలు బోర్డులు పాతిన మాట వాస్తవం కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు, గడివేముల అర్బన్‌లలో ఎమ్మెల్యేపై దాదాపు 120కి పైగా అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఆరోపించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని సవాల్‌ను స్వీకరించామని కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో బహిరంగ విచారణకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నివిధాలా అభివృద్ధి చేశారన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం 80శాతం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. అనంతరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు నియోజకవర్గం అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, భూకబ్జాలు, ఎర్రమట్టి తరలించి సొమ్ము చేసుకోవడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. రామక్రిష్ణారెడ్డి అనే వైసీపీ నాయకుడికి గుట్టపాడు పొలిమేరలో 57 ఎకరాలకు ఆర్‌ఎస్‌ఆర్ చూపిస్తున్నారని వీళ్లంతా ఎవరని మల్లెల ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే కాటసాని చేసిన తప్పులను సరి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు, కర్నూలు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



పెంచికలపాడు సీసీఐ కేంద్రం



పత్తి రైతు చిత్తు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 3: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) రైతులను దగా చేస్తున్నది. సవాలక్ష నిబంధనలు పెట్టి రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను మూసేయడానికి సిద్ధమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి పంటను సాగు చేసిన దాదాపు లక్ష మంది రైతులు సీసీఐ అధికారుల వైఖరితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- శఠగోపం పెట్టిన సీసీఐ
- రెండు రోజుల్లో కొనుగోలు నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న రైతులు

● **రెండు రోజుల్లో సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు బంద్:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ఖరీఫ్‌లో దాదాపు 2 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేశారు. రాష్ట్రంలోనే ఇంత పెద్ద విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్నది ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులే. గత సంవత్సరం అధిక వర్షాలు, నాసిరకం విత్తనాలతో పూర్తిగా పంట దెబ్బతిన్న రైతులు ఈ సంవత్సరం ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట చేతికొచ్చే సమయంలో పైర్లు ఎండిపోయి దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో తీవ్రనష్టానికి గురయ్యారు. వాతావరణం అనుకూలించి వుంటే ఎకరాకు పది క్వింటాళ్ల పత్తి దిగుబడి అందేది. అయితే.. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి కేవలం 2, 3 క్వింటాళ్లకే పరిమితం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గోరుచుట్టుపై రోకటి పోటులా సీసీఐ అధికారుల వ్యవహారంతో పత్తి రైతులు మరింతగా నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటం పత్తికి రూ.7,020 మద్దతు ధరను ప్రకటించింది. అయితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీసీఐ అధికారులు ఆదోని, ఎమ్మిగనూరు, కల్లూరు మండలంలోని పెంచికలపాడుతో పాటు నంద్యాలలో పత్తి కొనుగోలు కేంద్రాలను రెండు నెలల క్రిందట ప్రారంభించారు. అయితే.. ఒక్క పెంచికలపాడు సీసీఐ కేంద్రంలో మాత్రమే అరకొరగా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. మిగిలిన చోట్ల వివిధ కారణాలు చూపి సీసీఐ అధికారులు కేంద్రాలను మూసివేశారు.



రెండు రోజుల్లో పెంచికలపాడులోని కొనుగోలు కేంద్రం బంద్..

కోడుమూరు మార్కెట్ యార్డు పరిధిలోని పెంచికలపాడులో సీసీఐ అధికారులు ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల్లో మూసేయడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ సమాచారం తెలిసి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు మూతపడి రైతులు తక్కువ ధరకే పత్తిని వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. కొంత మంది రైతులు మాత్రం పెంచికలపాడు కొనుగోలు కేంద్రంలో అరకొరగా రైతులు పత్తిని విక్రయించారు. ఈ కేంద్రంలో కూడా వివిధ కారణాలు చూపుతూ క్వింటం పత్తికి 6,900 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు.



● జిల్లాలో పత్తి పంట సాగు 4 లక్షల ఎకరాలకు పైగానే ఉంది. అరకొర పంట దిగుబడిని అంచనా వేసినా దాదాపు 12 లక్షల క్వింటాళ్ల దిగుబడి రైతుల వద్ద ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో అంచనా వేస్తే.. దాదాపు రూ.800 కోట్ల పంట దిగుబడి రైతుల వద్ద ఉంది. ఇప్పటి దాకా ఉమ్మడి జిల్లాలో సీసీఐ అధికారులు కేవలం 6,200 క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో కూడా రూ.4.27 కోట్లను రైతులకు అందించాల్సి ఉండగా.. ఇంకా 300 మంది రైతులకు డబ్బులు చెల్లించాలని పెంచికలపాడు సీసీఐ అధికారి సాంబశివరావు తెలిపారు. కష్టాల్లో ఉన్న రైతులకు మద్దతు ధరను అందించేందుకు నామ్‌కేవాస్తే చర్యలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయే తప్ప, పూర్తి స్థాయిలో ఆ కేంద్రాలను నిర్వహించడం లేదని రైతు సంఘాల నేతలు ధ్వజమెత్తుతున్నారు.



రెండు రోజుల్లో కేంద్రాల మూసివేత

రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి నుంచి విత్తనాలను వేరు చేసే పనికి సంబంధించి కొన్ని ఆటంకాలు ఏర్పడుతున్నాయి. విత్తనాలను అమ్మేందు కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ వ్యవహారం పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టే పరిస్థితి నెలకొంది. అందువలనే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసే కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయమని ఉన్నతాధికారులు ఆదేశించారు.

- సాంబశివరావు, సీసీఐ, కేంద్రం అధికారి

శ్రీశైలంలో తామ్ర శాసనాలు లభ్యం

విజయనగర రాజుల కాలానివిగా గుర్తింపు

నంద్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో ఘంటా మఠం జీర్ణోద్ధరణ పనులు సందర్భంగా విజయనగరం రాజుల కాలం నాటి తామ్ర శాసనాలు ఇటీవల లభ్యమయ్యాయి. ఈ శాసనాలు విజయనగర రాజు సంగమ వంశానికి చెందిన మూడో విరూపాక్షుడి కాలానికి చెందినవని, శక సంవత్సరం 1395లో విజయ సంవత్సరం చైత్ర మాసం శుక్ల పక్షం 13వ తిథిన అంటే ప్రస్తుతం అనుసరిస్తున్న కేలండర్ ప్రకారం 1473వ సంవత్సరం మార్చి 12 శుక్రవారం నాడు రాయించినట్లు తెలుస్తోంది. ఈ శాసనాలు సంస్కృత, కన్నడ, దేవనాగరి లిపిలో ఉన్నాయి. వీటి ప్రకారం మూడో విరూపాక్షుడు శ్రీశైల మల్లికార్జున స్వామి రథోత్సవాలను నిర్వహించేందుకు అప్పటి కోపాణ సీమ యాదవపురంలోని మంగళపురం, యలబర్గసీమలోని తిప్పరసోపల్లి, వేదవతి గ్రామాలను దానంగా రాయించి, అప్పటి భిక్షవృత్తి మఠాధిపతి సిద్ధయ్యదేవుడికి అందించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఆత్రేయ గోత్ర, యజు శాఖకు చెందిన వల్లభ, దుర్గయ, విరాణ బ్రాహ్మణులకు 20 వరహాలను బహుమతిగా ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.



తామ్ర శాసనం

గవర్నర్‌ను కలిసిన ఆర్‌యూ వీసీ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ జనీర్ ఆహ్మద్‌ను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ కలిశారు. శనివారం అమరావతిలోని గవర్నర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉపకులపతిగా అవకాశం కల్పించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. నూతన ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న ఆయన వర్సిటీ అభివృద్ధికి మార్గ దర్శకం చేయాల్సిందిగా గవర్నర్‌ను కోరారు.



గవర్నర్‌ను కలిసి ఆర్‌యూ వీసీ

నాన్ లోకల్ వార్!

- ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జిగా బుట్టా రేణుక
- కోడుమూరు ఇన్‌చార్జిగా ఆదిమూలపు సతీశ్
- ఇద్దరు కూడా స్థానికేతరులనే ఆ పార్టీలో ప్రధాన చర్చ
- పార్టీ కోసం పని చేస్తే మొండిచేయి చూపుతారా?
- టికెట్ ఆశించి భంగపాటుకు గురైన నేతల మనోవేదన



కర్నూలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలకు ఇన్‌చార్జిల నియామకం వ్యవహారం వైసీపీలో 'నాన్ లోకల్' చిచ్చు రేపుతుంది. స్థానికంగా ఉంటూ తమకు కాకుండా ఇతరులకు టికెట్ల కేటాయింపు ఎలా చేస్తారంటూ? వైసీపీ నేతలు పార్టీపై ధిక్కారస్వరం వినిపిస్తున్నారు. సర్వేల పేరుతో తమను దూరం ఉంచడంపై వైసీపీ టికెట్లు ఆశించి భంగపాటుకు గురైన నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బుట్టా రేణుక, కోడుమూరు (ఎస్సీ రిజర్వుడ్) అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌ల పేర్లు ఖరారు చేస్తూ వైసీపీ అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించింది. ఇద్దరూ కూడా స్థానికేతరులు కావడంతో వైసీపీలో 'నాల్ లోకల్' రగడ మొదలైంది. అధిష్ఠానం తీరును తప్పుపడుతున్నారు.

● **ఎమ్మిగనూరు లోకల్‌గా బీసీ నాయకులు లేరా..?**

రాబోయే ఎన్నికల్లో ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి గా మాజీ ఎంపీ బుట్టా రేణుకను ఆ పార్టీ అధిష్ఠానం తాజాగా ఆరో లిస్టులో ప్రకటించింది. 84 ఏళ్ల సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని వయోభారం అంటూ పక్కన పెట్టారు. గెలవలేరంటూ ఆయన కొడుకు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి పార్టీ టికెట్‌ను నిరాకరించింది. బీసీ కార్డును తెరపైకి తీసుకు రావడంతో అనుహ్యంగా ఎమ్మెల్యే ఎర్రకోట సూచన మేరకు మాచాని వెంకటేశ్‌ను అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది. రీసర్వే పేరిట జరిగిన రాజకీయ సమీకరణాల మధ్య ఎట్టకేలకు మాజీ ఎంపీ బుట్టా రేణుకను ప్రకటించారు. ఇది ఆ పార్టీలో నాన్ లోకల్ చిచ్చును రాజేసింది. ఎమ్మిగనూరు వైసీపీలో లోకల్ బీసీ నాయకులు లేరా..? వాళ్లకు గెలిచే సత్తా లేదని అధిష్ఠానం భావిస్తోందా..? గెలవలేనప్పుడు వాళ్ల ఓట్లు అవసరమా? అంటూ వైసీపీలో స్థానిక బీసీ, చేనేత నాయకులు ఆగ్రహంతో ఉన్నారు. 1982 నుంచి ప్రత్యేక్ష రాజకీయాల్లో కొనసాగుతున్న ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్ ఆనాటి నుంచి జరిగిన సార్వత్రిక, ఉప ఎన్నికల్లో దివంగత నేతలు మాజీ సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి, మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి సహా తాజా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గెలుపు కోసం పని చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం రుద్రగౌడ్ వైసీపీ టికెట్ కోసం చివరి వరకు తీవ్రంగా ప్రయత్నించారు. బీసీ సామాజకవర్గానికి చెందిన ఆయనకు కనీస సమాచారం ఇవ్వకుండా బుట్టా రేణుకను ఎంపిక చేయడంపై ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. చేనేత సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ కేఎస్ రఘు, మాజీ ఛైర్మన్ బుట్టా రంగయ్య, గోనెగండ్లకు చెందిన డాక్టర్ పరిమళ టికెట్లను ఆశించారు. వీరందరిని కాదని మాజీ ఎంపీ బుట్టా రేణుక ప్రకటించారు. అయితే బుట్టా రేణుక పేరును ప్రతిపాదించడానికి ఎమ్మెల్యే ఎర్రకోట మొదట్లో ఆసక్తి చూపలేదు. ఇప్పుడు అధిష్ఠానం ఒత్తిడి మేరకు తప్పని పరిస్థితుల్లో ఒకే చేయాల్సి వచ్చింది. ఎమ్మెల్యే ఎర్రకోట సూచన మేరకు మాచాని వెంకటేశ్ పేరు ప్రకటించి ఆ వెంటనే మార్పు చేయడంపై తమకు అవమానం చేశారంటూ మాచాని కుటుంబీకులు కూడా ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

● **కోడుమూరులో నాన్ లోకల్ రగడ!**

కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా ఆదిమూలపు సతీశ్‌ను సీఎం జగన్ ప్రకటించడం పార్టీలో నాన్ లోకల్ చిచ్చుకు దారితీసింది. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు వైసీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యేలు పరిగెల మురళీకృష్ణ, ఎం.మణిగాంధీ, సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌లు ఆశించారు. తనకే టికెట్ వస్తుందని మొదటి నుంచి డాక్టర్ సుధాకర్ గట్టిగా నమ్ముతూ వచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు సైతం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. గత ఎన్నికల్లో కూడా మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ టికెట్ ఆశిస్తే చివరి క్షణంలో మొండి చూపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ టికెట్ ఇస్తారని ఆయన ఆశించారు. అదే క్రమంలో కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి సన్నిహితుడైన సి.బెళగల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన సంధ్యా విక్రమ్‌కుమార్ వైసీపీ టికెట్ ఆశించారు. వీరందరినీ కాదని సీఎం జగన్ ప్రకాశం జిల్లాకు చెందిన మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తమ్ముడు డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌ను కోడుమూరు అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన కర్నూలులో ఉన్న రాయలసీమ క్రిస్టియన్ విద్యా సంస్థలు నిర్వహిస్తూ కర్నూలు నగరంలోనే చాలాసంవత్సరాలుగా ఉంటున్నారు. అయినా పదేళ్లుగా ఏ ఒక్క రోజు కూడా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, ప్రకాశం జిల్లాకు చెందిన నాయకుడు అంటూ వైసీపీలోని ఓ వర్గం నాయకులు ప్రచారానికి తెరతీశారు. తమను కాదని కేవలం డబ్బు పెట్టుకుంటాడన్న ఒకే ఒక్క కారణంతో సతీష్‌ను అభ్యర్థిగా ప్రకటించడం ఏమిటని టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు వైసీపీ అధినాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇక వైసీపీ నాయకుడు సంధ్యా విక్రమ్‌కుమార్ ఓ అడుగు ముందుకేసి గూడూరులో ప్రజా చైతన్య సభ పెట్టి ధిక్కార స్వరం వినిపించారు. కోడుమూరు టికెట్ విషయంలో సీఎం జగన్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.



బుట్టా రేణుక



ఆదిమూలపు సతీశ్

నదీ తీరంలో దాహం

- ముళ్ల పొదలతో నిండిపోయిన హంద్రీ
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ప్రజలు
- ఇసుక అక్రమ తరలింపుతో అడుగంటిన భూగర్భ జలాలు



కంప చెట్లు మొలిచిన హంద్రీ నది

గోనెగండ్ల, ఫిబ్రవరి 3: హంద్రీనది పరివాహక గ్రామాలలో వేసవి రాకముందే ఈ ఏడాది తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ఈ ఏడాది వర్షాలు కురియక పోవడంతో హంద్రీ నదిలో నీరు అడుగంటిపోయింది. నది పొడవునా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. దీనికి తోడు అక్రమంగా కొందరు అక్రమంగా నదిలోని ఇసుకను తరలించుక పోతుండటంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో హంద్రీ పరిసర గ్రామాలైన హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, అగ్రహారం, బైలుప్పల, తిప్పనూరు, లింగందిన్నె, వీరంపల్లి బోదేపాడులో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ గ్రామాలకు తాగునీరు అందించేందుకు గాను అధికారులు హంద్రీనదిలో బోర్లు వేశారు. అయితే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లకు నీరు అందడం లేదు. దీంతో గ్రామాలకు సకాలంలో నీటి సరఫరా నిలిచిపోతుంది. హెచ్ కైరవాడి గ్రామంలో కురువపేట, జంబానవీధి, బీసీ కాలనీలలో తీవ్ర నీటి సమస్య తలెత్తింది. మిగతా గ్రామాలలో హంద్రీనదిలో వేసిన బోర్ల నీటిని రెండు రోజులకు ఒకసారి విడుదల చేస్తున్నారు. దీంతో గ్రామస్థులు గ్రామ శివార్లలోని బోరు, బావులు నుంచి ద్విచక్రవాహనపై నీటిని తీసుకువస్తున్నారు. హెచ్ కైరవాడి గ్రామస్థులు గత సోమవారం నదీ తీర గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించమని కలెక్టర్ సృజనకు వినతి పత్రం అందజేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే కొందరు అక్రమార్కులు రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా హంద్రీ నుంచి తరలిస్తుండటంతో నదిలో భూగర్భజలాలు అడుగంటి పోయాయని ప్రజలు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హంద్రీ నదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీరు విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగి తాగునీటి బోర్లకు నీరు అందుతుందని, కొంత వరకు నీటి సమస్య తీరుతుందని ప్రజలు అంటున్నారు.



కొళాయి నీటి కోసం క్యూలైన్‌లో పెట్టిన బిందెలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనదిలో వేసిన బోర్లు ఎండిపోయాయి. బీసీ కాలనీ, బంజన్నవీధి, కురువ వీధులకు నీరు అందడం లేదు. ఇప్పుడే ఇట్లా ఉంటే ఇక వేసవిలో తాగునీటి సమస్య ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. అధికారులు హంద్రీ పరిసర గ్రామాలలోని తాగు నీటి సమస్యను పరిష్కరించాలి.

-రాజేష్, హెచ్ కైరవాడి

క్యాన్సర్ పట్ల ఆందోళన వద్దు

- అందుబాటులో అధునాతన వైద్యం
- నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్ కేసులే అధికం
- ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది బాధితులు
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే



కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 3: ప్రపంచ మానవాళిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. అయితే రోగులు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అధునాతన వైద్యం అందుబాటులో ఉందని వైద్యులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్లే ఎక్కువ మంది ఈ రోగం బారిన పడుతున్నారు. నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్ కేసులే అధికంగా నమోదు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా జనాలను బలి తీసుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ మహమ్మారిది రెండో స్థానం. డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం భారతదేశంలో రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ కేసులు 32 శాతం ఉన్నాయి. భారతదేశంలో 14.12 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదు కాగా ఇందులో 9.16 లక్షల మరణాలు సంభవించాయి. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు తొమ్మిది మంది పురుషుల్లో ఒకరు, 12 మంది మహిళల్లో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి ఏటా 4వ తేదీన వరల్డ్ క్యాన్సర్ డేను జరుపుకుంటారు. క్యాన్సర్ నివారణ చికిత్సను ప్రోత్సహించేందుకు క్యాన్సర్ డేను నిర్వహిస్తుంటారు. 1993 జేనివాలో యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యుఐసీసీ) స్థాపించారు.

ఈ ఏడాది థీమ్: ప్రతి యేటా ఒక థీమ్‌ను తీసుకుని వరల్డ్ క్యాన్సర్ కంట్రోల్ యూనియన్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది క్యాన్సర్ కేర్ గ్యాప్‌ను తగ్గించండి. రోజురోజుకు మనిషి జీవనశైలిలో అనేక మార్పులు వస్తున్నాయి. ఆ మార్పులకు తగ్గట్టు కొత్త కొత్త రోగాలు కూడా వస్తున్నాయి. అయితే మనిషి ప్రాణాంతకరమైన రోగాల బారిన పడి భయంతోడైతే రోజులు దగ్గర పడ్డట్టే. క్యాన్సర్ విషయంలో దాదాపు ఇదే జరుగుతోంది. చక్కటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మెరుగైన జీవనశైలిని అలవర్చుకోవడంతోపాటు వైద్య చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చని వైద్యులు అంటున్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019 జనవరి 23న రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తికాగా వైద్యపరికరాలు రావాల్సి ఉంది. మెడికల్, సర్జికల్, రేడియేషన్ న్యూక్లియర్, మెడిసిన్ క్యాన్సర్ చికిత్సలు ప్రజలకు అందనున్నాయి. 120 పడకలతో ఏర్పాటు కానున్న స్టేట్‌క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో రాయలసీమ జిల్లాల ప్రజలకే కాకుండా గద్వాల, బళ్లారి, రాయచూరు జిల్లాల రోగులకు ఎంతో మేలు జరగనుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

మద్యపానం, ధూమపానం, పొగాకు నమలడం వంటి అలవాట్ల కారణంగా కొందరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. మరికొందరు అవగాహన లోపం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యాధికి గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 20వేల మందికి పైగా క్యాన్సర్ రోగులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరంతా వ్యాధి రెండో దశకు చేరుకున్నవారే. మరెంతో మంది వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోకపోవడంతో వెలుగులోకి రాలేదు. వ్యాధిగ్రస్థుల్లో ఎక్కువ శాతం మంది గుట్కా, ఖైనీ, జిందా, సిగరేట్ వంటి



మత్తు పదార్థాలను నమిలేవారే ఉన్నారు. పొగతాగే అలవాటు ఉన్న వారు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఇక మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడే వారు అధికంగా ఉన్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్ సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు.



కర్నూలు నగరంలో నిర్మాణంలో ఉన్న క్యాన్సర్ ఆసుపత్రి

120 పడకలతో క్యాన్సర్ హాస్పిటల్



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని పది ఎకరాల్లో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ 120 పడకలతో ఏర్పాటు కానుంది. మెడికల్ అంకాలజి, సర్జికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజి, న్యూక్లియర్ మెడిసిన్, పాలిటివ్ కేర్‌తో పాటు బయోకెమిస్ట్రీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడీయాట్రిక్ అంకాలజి, డిపార్టుమెంట్లు వస్తాయి. ఐదు ఆపరేషన్ థియేటర్లతోపాటు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. టాటా ట్రస్టు సాంకేతిక సహకారంతో కర్నూలులో కె.ఆకారంలో నిర్మించే ఈ హాస్పిటల్ వల్ల ఎంతో మంది పేద క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ స్థాయిలో లేటెస్టుగా సేవలు అందుతాయి.

- డాక్టర్ కృష్ణప్రకాష్, హెచ్‌వోడీ, క్యాన్సర్ విభాగం, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ అని ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎన్నో వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ విషయంలో మహిళలు, యువత తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జీవన శైలి మార్పులు సరైన వైద్య పరీక్షలు, ముందస్తుగా గుర్తించడం తగిన చికిత్స ద్వారా ఈ వ్యాధిని నివరించవచ్చు.

- డాక్టర్ బి.రవీంద్రబాబు, క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు, ఒమేగా హాస్పిటల్, కర్నూలు

ఆడపిల్లలకు టీకా తప్పనిసరి



9 నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలకు తప్పనిసరిగా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ టీకాలు వేయించుకోవాలి. ఇటీవల కేంద్రం కూడా బడ్జెట్‌లో బాలికలకు మిషన్ ఇంద్రధనస్సు ద్వారా టీకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సర్వేకల్ క్యాన్సర్ తగ్గుముఖం పడుతుంది. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు.

- డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

నాపరాయి తవ్వకాలపై విజిలెన్సు దాడులు

వ్యక్తిపై కేసు నమోదు.. వాహనాల సీజ్



నాపరాళ్ల తవ్వకాలపై దాడులు నిర్వహిస్తున్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: పలుకూరు గ్రామ పొలిమేరలోని సర్వే నెంబర్ 719లో అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం గనుల శాఖ ఆధ్వర్యంలో విజిల్సె విభాగం తనిఖీలు నిర్వహించింది. బనగానపల్లె మండలం పలుకూరు పొలిమేరల్లో 3,400 క్యూబిక్ మీటర్ల మేర నాపరాయిని తవ్వి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. ఈ తవ్వకాలకు సంబంధించి గడ్డం మధుసూధన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. కేసు విచారణ చేసి దోపిడీకి గురైన సొమ్మును రికవరీ చేస్తామని చెప్పారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏడీ భైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, మురహరి పాల్గొన్నారు.

రేపు స్పందన

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి. సృజన శనివారం ఒక ప్రకటనలో తెలపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 3: లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. శనివారం కోవెలకుంట్ల, సౌదరదిన్నె గ్రామాల మధ్య ఉన్న రహదారిలో ఈ ఘటన జరిగింది. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన పెద్దరాముడు కుమారుడు కృష్ణయ్య (34) కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన శివలక్ష్మిని వివాహం చేసుకొని ఇటిక్యాల గ్రామంలో నివసిస్తున్నాడు. ఇటీవల ముత్తలూరులో జరిగే ఉత్సవాలకు భార్యతో కలిసి కోవెలకుంట్లలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం పని నిమిత్తం మోటారు బైక్‌పై కోవెలకుంట్ల నుంచి సౌదరదిన్నె వైపు వెళ్తుంగా వెనుక వైపు నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోవెలకుంట్ల ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

ట్రాక్టరు ట్రాలీ కింద పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 3: మండలంలోని కనకాద్రి పల్లె గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి (60) ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మృతి చెందాడు. ఇటిక్యాల, కనకాద్రిపల్లె గ్రామాల మధ్య శనివారం ఈ ఘటన జరిగింది. కనకాద్రి పల్లె గ్రామానికి ఇటిక్యాల పాలిష్ ఫ్యాక్టరీ నుండి ట్రాక్టరులో నాపరాయి లోడు చేసుకొని వెళ్తుండగా వాహనం ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ పక్కనే కూర్చున్న భాస్కర్ రెడ్డి ట్రాలీలోని నాపరాళ్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కొలిమలగుండ్ల హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మంత్రాలయం మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఫిబ్రవరి 3. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శనివారం మాఘమాసం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఊరేగించారు.

శ్రీమఠంలో పరిమళ ప్రసాదం ధర పెంపు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పరిమళ ప్రసాదం ధరను పెంచినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి రూ.25 ఉన్న ప్యాకెట్ పరిమళ ప్రసాదాన్ని రూ.30 చేసినట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని గంజాయి మయం చేసిన జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: రాష్ట్రాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి గంజాయిమయంగా మార్చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత చంద్రబాబు పాలనలో పెట్టుబడులు పెరిగితే.. జగన్‌రెడ్డి పాలనలో గంజాయి ఎగుమతులను పెంచాడని విమర్శించారు. 2014లో రాష్ట్రం విడిపోయి రూ. 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథం వైపు తీసుకుని వెళ్లేందుకు చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చారని అన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చివేశారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని యువతను మత్తు పదార్థాలకు, మద్యం, గంజాయికి బానిసలుగా మార్చేశాడని అన్నారు. రాష్ట్రం గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రం అన్నివిధాలుగా నష్టపోయిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నాయకత్వాన్ని బలపరిచి చంద్రన్న పాలనను తిరిగి తెచ్చుకుందామని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

గోకుల్‌రెడ్డి మళ్లీ హౌస్ అరెస్ట్



గోకుల్ కృష్ణారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3 : జడ్పీటీసీ సభ్యుడు గోకుల్‌రెడ్డిని పోలీసులు మళ్లీ హౌస్ అరెస్టు చేశారు. శనివారం తెల్లవారు జామునే నంద్యాల తాలుకా పోలీస్ అధికారులు, సిబ్బంది మండలంలోని భీమవరం గ్రామంలో ఉన్న గోకుల్ కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను నిర్బంధించారు. సామాజిక మాధ్యమాల్లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి కటౌట్ చూపుతూ అభ్యంతరకర వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. 'ఎప్పుడన్నా వేటాడే వేటగాళ్లను చూశావా.. నీ అమ్మ మొగుడొచ్చాడు' అనే వ్యాఖ్యలతో ఉన్న వీడియోపై గోకుల్ కృష్ణారెడ్డి మండిపడ్డారు. ఇందుకు నిరసనగా మాతృమూర్తుల ఆత్మగౌరవ దీక్షను శనివారం నంద్యాలలోని గాంధీ చౌక్‌లో చేపట్టాలని నిర్ణయించారు. ఇది తెలుసుకున్న పోలీసులు గోకుల్ ఇంటికి వెళ్లి నిర్బంధించారు. పోలీసులు, గోకుల్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా గోకుల్ మాట్లాడుతూ అధికారం చేతుల్లో ఉంది కదా అని ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టించడం ఎమ్మెల్యేకు సరి కాదన్నారు. వైసీపీ పరువును బజారు కీడుస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని హెచ్చరించారు. ఎన్నికల్లో టికెట్ తనకేనని విర్రవీగుతున్నారని, సీఎం వద్ద ఉన్న ధనుంజయ్, సజ్జల రామకృష్ణారెడ్డిలను కొనుక్కున్నామని ప్రచారం చేసుకోవడం ఎమ్మెల్యే దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. డబ్బుందన్న అహంకారంతో నంద్యాల ప్రజలను కొనేస్తానంటే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు. గోకుల్ హౌస్ అరెస్టుతో ఆయన తల్లి భక్తవత్సలమ్మ నంద్యాలలోని ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయ ఆవరణలో దీక్ష చేపట్టారు. అనంతరం దీక్షా శిబిరం నుంచి మహిళలతో కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసేందుకు ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో అసహనంతో వెనుదిరిగారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 3: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటకలోని అష్ట మఠాలలోని ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి వేద వర్ధన తీర్థులు శనివారం ఉదయం మంత్రాలయం వచ్చారు. స్వామిజీకీ ఆలయ మహా ముఖ ద్వారం వద్ద శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

శ్రీమఠంలో ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి



ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: జిల్లాలోని ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఈనెల 22 లోపు ఆసక్తిగల వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కుల ధ్రువీకరణతో పాటు ఆధార్ జిరాక్స్ రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కర్నూలు నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయానికి నేరుగా కానీ రిజిస్ట్రర్ పోస్టు ద్వారా కానీ పంపాలని తెలిపారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జోన్ 4లో తహసీల్దార్లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా బదిలీ పొందిన తహసీల్దార్లకు కలెక్టర్ జి.సృజన శనివారం కొత్త స్థానాలను కేటాయించారు.

పేరు	కేటాయించిన స్థానం
కులశేఖర్	ఏఓ, కలెక్టరేట్
చౌదరి	డి.సెక్షన్, కలెక్టరేట్
నిర్మలాదేవి	బి.సెక్షన్, కలెక్టరేట్
వాసుదేవన్	సి.సెక్షన్, కలెక్టరేట్
ఝాన్సీలక్ష్మి	ఏఓ, ఆర్డీఓ కార్యాలయం
శేషయ్య	ఏఓ, సబ్ కలెక్టరేట్, ఆదోని
నాగభూషణం	ఏఓ, ఆర్డీఓ కార్యాలయం, పత్తికొండ
మోహన్‌కుమార్	కర్నూలు అర్బన్
మునివేలు	కల్లూరు
మాధవరాజు	పత్తికొండ
అనంతాచారి	వెల్దుర్తి
షర్మిల	తుగ్గలి
రజాక్ వలి	మద్దికెర
పద్మజ	చిప్పగిరి
అనురాధ	క్రిష్ణగిరి
శ్రీధర్	మంత్రాలయం
అనుపమ	సి.బెల్‌గల్
గురప్ప	కోడుమూరు
ఓబులేసు	నందవరం
పార్వతి	గోనెగండ్ల
నటరాజ్	ఓర్వకల్లు
అలెగ్జాండర్	కౌతాళం
సురేష్ బాబు	పెద్దకడుబూరు
మురళి	కోసిగి
హసీనాసుల్తానా	ఆదోని
ప్రసాద్ రాజు	హొళగుంద
ఈశ్వరయ్య	దేవనకొండ
బేలయ్య	హాలహర్వి
ఈరమ్మ	ఆస్పరి
చంద్రశేఖర్	ఆలూరు
రామాంజనేయులు	కర్నూలు రూరల్
ఉదయ్ సంతోష్	గూడూరు

కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం, ఫిబ్రవరి 3: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ కర్ణాటక మద్యాన్ని అరికట్టేందుకు మండలంలో కట్టుదిట్టమైన నిఘా ఉంచుతున్నట్లు కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన ఈడిగ శివకుమార్ ద్విచక్రవాహనంపై 5 బాక్సుల(480) కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా తమ సిబ్బందితో కలసి అతన్ని పట్టుకుని 5బాక్సుల కర్ణాటక మద్యం, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : మంత్రాలయానికి చెందిన ఆటో డ్రైవర్ విరుపాక్షిపై పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 30వ తేదిన ఆదోని మండలం కుప్పగల్‌కు చెందిన రైతు పండ్ల వ్యాపారి చెన్నారెడ్డి తను పండించిన పండ్లను ఆదోనిలో అమ్ముకొని సొంత గ్రామానికి ఆటోలో బయల్దేరాడు. ఆటో కడితోట సమీపానికి రాగానే డ్రైవర్ ఆటోను నిలిపి ఆ రైతును బెదిరించి రూ.2,900 నగదును తీసుకొని రోడ్డుపై వదిలేసి ఉడాయించాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించామని, త్వరలో అరెస్టు చేస్తామని ఎస్.ఐ పీరయ్య తెలిపారు.

స్థాయి తగ్గింది..!

● సమావేశాలకు కొందరు జడ్పీటీసీల డుమ్మా
● ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలకు స్థాయి తగ్గుతోంది. 60 రోజులకోసారి నిర్వహించే ఏడు స్థాయి సంఘ సమావేశాలకు ఉమ్మడి జిల్లాల అధికారులతోపాటు జడ్పీటీసీలు, ఎమ్మెల్యే, ఎంపాలు హాజరు కావాల్సి ఉంది. అయితే శనివారం జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో జరిగిన ఏడు స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వహించగా సీఈఓ జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఇప్పటి వరకు జరిగిన స్థాయి సంఘ సమావేశాలకు ఇద్దరు ఎంపీలు ఒక్కసారి కూడా హాజరు కాలేదు. ఎమ్మెల్యేలు కూడా సమావేశాలకు హాజరు కాకపోవడం గమనార్హం.


1వ, 7వ స్థాయి సంఘ సమావేశాలకు పూర్తి స్థాయిలో హాజరైన జడ్పీటీసీలు, అధికారులు

కొందరు జడ్పీటీసీలు డుమ్మా..

ఏడు స్థాయి సంఘ సమావేశాల్లో 1, 7వ స్థాయి సంఘ సమావేశాలకు మాత్రమే అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరయ్యారు. మిగిలిన 2,3,4,5,6 స్థాయి సంఘ సమావేశాలకు జడ్పీటీసీలు సగం మంది కూడా హాజరు కాలేదు. దీంతో స్థాయి సంఘ సమావేశాలంటే వారికి లెక్కలేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన జడ్పీటీసీలు సమావేశాలకు డుమ్మా కొట్టడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

● శనివారం జరిగిన సమావేశంలో ఓర్వకల్లు మండలం కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని ఎంతోకాలంగా అడుగుతున్నా పట్టించుకోవడం లేదని జడ్పీటీసీ రంగనాథగౌడు కోరారు. ప్రహరీ లేకపోవడంతో గతంలో ఒక బాలుడు బావిలో పడి మరణించారని, ఇటీవల మరో బాలుడు బయటికి వచ్చి ప్రమాదవశాత్తు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రులలో కమిటీ సమావేశాలు నిర్వహించకుండా అధికారులు కాలయాపన ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆసుపత్రులలో అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఎందుకు నిర్వహించడం లేదని జడ్పీటీసీ డీఎంఅండ్‌హెచ్‌ను ప్రశ్నించారు. మండల కేంద్రంలో షాదిఖానా నిర్మించడానికి స్థలం కేటాయించినా ఎందుకు మంజూరు చేయలేదని మైనార్టీ సంక్షేమ అధికారిని కోరారు.

● వెల్దుర్తిని కరువు మండలంగా ప్రకటించినా ఇప్పటి వరకు పంట నష్ట పరిహారం ఎందుకు రాలేదని జడ్పీటీసీ సుంకన్న అధికారులను నిలదీశారు. సంక్రాంతికే రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిందని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్ వస్తే నష్ట పరిహారం వెనక్కి వెళుతుందని, తక్షణమే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

● మిద్తూరు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు వేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని స్థాయి సంఘ సమావేశంలో చెప్పినా ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. టెండరు రద్దు చేసి మెయింటెనన్స్ కింద పనులు చేపట్టాలని కోరారు. మిద్తూరు-ఓర్వకల్లు రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, మండలానికి మంజూరైన మల్లికార్జున రిజర్వాయర్‌ను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించాలని అన్నారు. గతంలోనే రిజర్వాయర్ వద్దని గ్రామ ప్రజలంతా ముక్తకంఠంతో మొరపెట్టుకున్నారని గుర్తు చేశారు. తక్షణమే రిజర్వాయర్ రద్దు అయినట్లు అధికారుల ప్రకటన ఇవ్వాలని ఆయన కోరారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

ఉమ్మడి జిల్లాలో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించి వలసల నివారణకు చర్యలు చేపట్టాలి. వివిధ శాఖల్లో ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాల వివరాలను అధికారులు స్థానిక ఎంపీడీఓలకు పంపాలి. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా కురవడంతో తాగు, సాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రులలో కమిటీ సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలి. పీహెచ్‌సీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. సమావేశంలో జిల్లా పరిషత్ 2023-24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2024-2025 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలను డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి వివరించారు. సమావేశాలకు జడ్పీ డిప్యూటీ ఛైర్మన్లు దిల్షాద్ ముజఫర్ నాయక్, కురువ బుజ్జమ్మ, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, రంగనాథగౌడు, సుంకన్న, ప్రసన్నకుమార్ సుధాకర్‌రెడ్డి, మౌలాలి, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

- ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ ఛైర్మన్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి: సీపీఐ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. పాలస్తీనపై జరుగుతున్న దురాక్రమణపై శనివారం సీపీఐ అధ్వర్యంలో కార్యాలయంలో పుస్తకం విడుదల చేశారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ ప్రపంచదేశాలన్నీ పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలని గగ్గోలు పెడుతున్న, అమెరికా అండతో ఇజ్రాయేల్ దాడులు చేస్తుందని విమర్శించారు. ప్రపంచదేశాలు యుద్ధాలు చేయకపోతే అమెరికా మనుగడ సాగదన్నారు. ఏదో ఒక దేశానికి గొడవలు పెట్టి అమెరికాలో తయారయ్యే మందు గుండు సామగ్రిని అమ్ముకుటుందదని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి: డీఏవో

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 3: రబీ పంటలకు సంబంధించి ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి తెలిపారు. శనివారం సూపర్ చెకింగ్‌లో భాగంగా ప్యాలకుర్తి, కోడుమూరు, వర్కూరు గ్రామాల్లో జాబితాను జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. ఈనెల 10లోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కావాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్యాలకుర్తి గ్రామంలో వేరుశనగ దిగుబడులను ఆమె పరిశీలించారు. వర్కూరులో కొర్ర పంటను పరిశీలించారు. ఆమె వెంట ఎంఏవో రవిప్రకాష్, ఉన్నారు.

టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలి


అంగన్‌వాడీ కేంద్రంలో టీకాలను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3: గర్భిణులు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని హుశేనాపురం పీహెచ్‌సీ పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. ఆ వివరాలను ఎన్‌సీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు యుడైస్ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలన్నారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ-సీబీటీఏ సిరప్ పంపిణీ చేశారు. ఈనెల 9న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలు వసూలు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: నగర పాలక సంస్థ పరిధిలో వ్యాపార సముదాయాల నుంచి ట్రేడ్ లైసెన్సు బకాయిలు వంద శాతం వసూలు చేయాలని కమిషనర్ భార్గవతేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని వ్యాపార, వర్తక సముదాయాల నుంచి వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్ కూడా క్రమం తప్పకుండా చేయించాలన్నారు. 10365 వర్తక, వ్యాపార సముదాయాలు ఉండగా 2024-25 సంవత్సరానికి రూ.3,94,95,592 బకాయిలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు సెక్రటరీలకు లక్ష్యాలు విధించి వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిలు ఉన్న వారికి తక్షణమే డిమాండ్ నోటీసు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫిబ్రవరి ఆఖరిలోగా వందశాతం బకాయిలు వసూలు చేయాలన్నారు.

మెగా డీఎస్సీ.. ఎన్నికల జిమ్మిక్కే: టీడీపీ


మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3: ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతను మళ్లీ బురిడి కొట్టిస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ నంద్యాల ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి మండిపడ్డారు. శనివారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఏటా జనవరి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీనిచ్చి నిరుద్యోగులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి, ఆదాం బాషా, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.

బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలి



సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: డ్రైవర్లను కఠినంగా శిక్షించి జైలుకు పంపే బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ డ్రైవర్లను తీవ్రంగా శిక్షించే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) 2023కు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ చట్టం అమలు చేస్తే డ్రైవర్లు రోడ్లపై కాకుండ జైల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 16న రవాణారంగాన్ని స్తంభింపజేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి జే.దివాకర్, ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.ప్రభాకర్, నాయకులు కే.గంగాధర్, వలి, వెంకటేష్ పాల్గొన్నారు.

'అల్లాబకాష్ సేవలు చిరస్మరణీయం'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 3: జిల్లా నాటక రంగానికి దివంగత అల్లాబకాష్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు రంగస్థల కళాకారులు కొనియాడారు. శనివారం పాతనగరంలో కోర్టు రోడ్డులోని యునైటెడ్ క్లబ్ సమావేశ హాలులో అల్లాబకాష్ సంతాప సభ నిర్వహించారు. జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో తొలుత అల్లాబకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ అల్లాబకాష్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే పౌరాణిక పద్య నాటకాల్లో రాష్ట్ర స్థాయిలో రాణించారని అన్నారు. శ్రీకృష్ణ, సత్య హరిశ్చంద్ర, అర్జున పాత్రలను పోషించి ఆయన ప్రేక్షకులను మెప్పించారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంచే పురస్కారంతోపాటూ, ఎన్టీయార్ పురస్కారం అందుకున్న ఘనత ఆయనదేనని అన్నారు. ఈ సమావేశంలో అల్లాబకాష్ కుమారుడు మహ్మద్ హుస్సేన్, సీనియర్ రంగస్థల నటులు హెచ్ చంద్రన్న, నాగభూషణం నాయుడు, వీవీ రమణారెడ్డి, పి.హనుమంతరావు చౌదరి, డి.దస్తగిరి, బైలుప్పల షఫీయుల్లా, పాండురంగయ్య, క్రిష్టఫర్, అరుణ కుమారి, రాధిక పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని ఒకటో వార్డు ఖండేరీలో నగరమా మేలుకో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు, ఇళ్ల పట్టాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, టీడీపీ నాయకులు మన్సూర్ అలీఖాన్, అబ్బాస్, వార్డు నాయకులు మారుతీ శర్మ, ఆనంద్, ఆయాత్‌బీ, కిరణ్, రమీజ్‌బాషా, బాలు, భాస్కర్, మున్నా, పౌలు, సాయి, మల్లికార్జున, జనసైనికుడు ప్రకాష్ పాల్గొ న్నారు.



నగరమా మేలు కో కార్యక్రమంలో పాల్గొన్న టీజీ భరత్

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా: పంప్‌హౌస్ గూడేం కొట్టాల ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలో 43, 44 వార్డుల పరిధిలోని అశోక్ నగర్ పంప్ హౌస్ గూడేం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో టీజీ భరత్ పాల్గొని మాట్లాడారు. కాలనీలో కనీస మౌలిక సదు పాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైసీపీ నాయకులు పట్టిం చుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని ధరలు పెరిగిపోయి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పెద్ద హుసేన్, చిన్న హుసేన్, సయ్యద్ హుసేన్, కమాల్, ఏసు, హరి, కృష్ణవేణి, నాగేశ్వరరావు, రవికుమార్, అశోక్, వెంకటేష్ చౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, సురేంద్ర లోకేశ్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని వైసీపీ అంధకారంలోకి నెట్టేసింది

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 3: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీని అంధకారంలోకి నెట్టివేసిందని కోడుమూరు టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి ఆరోపించారు. కర్నూలు రూరల్ మండలం సూదిరెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ఎక్కడ కూడా చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు వైసీపీ ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. వైసీపీ చేసిన దోపిడీ వలన రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యంరెడ్డి, మజీద్, శ్రీనివాసచౌదరి, వెంకటేశ్వరచౌదరి, వెంకట్రాముడుచౌదరి, ఎల్లయ్య, స్వాములు, వీరబాబు, కుమార్, పెద్దలక్ష్మీదేవి, పెద్దసుబ్బయ్య, బాబురెడ్డి, ముంతప్ప పాల్గొన్నారు.


సూదిరెడ్డిపల్లెలో టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు వివరిస్తున్న దస్తగిరి

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

సి.బెళగల్: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు కారకర్తలు కృషి చేయాలని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. మండల కేంద్రంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. టీడీపీలో చేసిన అభివృద్ధి తప్ప మండలంలో ఎక్కడ కూడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ఈసమావేశంలో టీడీపీ నాయకులు ముడుమాల పౌలు, సర్పంచ్‌లు అమర్, రామంజినేయులు, ఎంపీటీసీలు నూర్జహాన్, రేణుక, ధనుంజయుడు, బాలజీవెంకటేశ్, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న పాల్గొన్నారు.

ఉద్యోగుల వివరాలను నమోదు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్ ఎన్ఐసీ పోర్టల్‌లో వేగవంతంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కమ్యూనికేషన్ సెంటర్‌లో ఉద్యోగుల వివరాల నమోదు ప్రకియను డీఆర్వో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల డీడీఓలు వారి కార్యాలయ సిబ్బంది వివరాలను ఎన్ఐసీ పోర్టల్ నమోదు చేయించాలన్నారు. డీటీఓ రామచంద్రారావు, దీప్తి, జయలక్ష్మి, సునీల్ పాల్గొన్నారు.

పుల్లయ్య కళాశాలలో వర్క్‌షాప్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3: స్థానిక జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం టు వీక్ వర్క్‌షాపు ఆన్ రీసెర్చ్ మెథడాలజీపై వర్క్ షాపు నిర్వహించారు. ఈకార్యక్రమం ముగింపు సందర్భంగా వాలిడిక్టరీ ఫంక్షన్ నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ ఎంబీఏ డిపార్టుమెంటు రెండు వారాల పాటు నిర్వహిం చిన వర్క్‌షాపు పరిశోధనలకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఎంబీఏ విద్యార్థులు పురోగతి చెందాలంటే.. సీ.లాంగ్వేజ్, ఎస్.క్యూఎల్ లాంటి ప్రోగ్రామ్స్ అవసరం లేదన్నారు. డిజిటల్ మార్కెటింగ్, అనలిటిక్స్, పవర్‌బీఐ పైనే పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డా.ఎం.గిరిధర్ కుమార్, ఎంబీఏ విభాగాధిపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

గూడూరు, ఫిబ్రవరి 3: గూడూరు మండల నూతన ఎంపీడీవోగా జయశ్రీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకి మండల పరిషత్ అధికారులు అభినందనలు తెలి పారు. కార్యక్రమంలో ఏవో విజయసింహారెడ్డి, ఈవోఆర్డీ మధులత, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గోపాల్ రావు, నన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లు ఎంపీడీవోగా మల్లీశ్వరి శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శివనాగప్రసాద్ అనంతపురానికి బదిలీ చేశారు. కడప జిల్లా ఉయ్యాలపల్లిలో ఎంపీడీవోగా నిర్వహిస్తున్న మల్లీశ్వరిని ఓర్వకల్లు ఎంపీ డీవోగా బదిలీ చేశారు. నూతన ఎంపీడీవో మల్లీశ్వరికి సూపరింటెండెంట్ రమణయ్య, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని
జయప్రదం చేయండి: ప్రభాకర్‌రెడ్డి



కల్లూరు, ఫిబ్రవరి 3: కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు గ్రామ పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల టీడీపీ నాయకులు కోట్ల జయసూర్యప్ర కాష్‌రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత, టీజీ భరత్, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీసీ.జనార్థ న్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి, మల్లెల రాజశేఖర్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈసమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

మున్సిపల్ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిపై కమిషనర్ భార్గవతేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రెవెన్యూ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి 'నీవు పని చేస్తావా..? చేయవా..? లేదంటే మానుకొని వెళ్లిపో' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సెక్షన్‌లో పనిచేస్తున్న అటెండర్‌ను పిలిపించి ఎం బుక్కులు, ఫైలింగ్ ఏవిధంగా కాంట్రాక్టర్లకు చేరవేస్తున్నారు..? సీఎస్ఎం ఎస్‌లో అప్‌లోడ్ అయ్యే ప్రతి బిల్లును కాంట్రాక్టర్లకు ఎవరు చేరవేస్తున్నారు ? ప్రభుత్వ ఉద్యోగులు తప్పు చేస్తే జైలుకు పంపుతా .. ఆప్కాస్ ఉద్యోగు లైతే సస్పెండ్ చేస్తా అంటూ హెచ్చరించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ జిల్లాలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ గిరికుమార్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

కల్లూరు: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్యను కల్లూరు మండల డిప్యూటీ తహసీల్దారు గిరికు మార్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 3: కిశోరబాలికలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలనీ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతమ్మ అన్నారు. శనివారం మండలంలోని ముడుమాల, శింగవరం, ఈర్లదిన్నె గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 3: మండలంలోని లద్దగిరిలో విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి చెందాడు. గ్రామానికి చెందిన సురేష్(34) గొర్రెలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం స్థానిక వంతెన సమీపంలో ఓ పొలంలో గొర్రెల మేత కోసం చెట్ల కొమ్మలను సేకరిస్తున్నాడు. అయితే చెట్లపైనే వెళ్లిన విద్యుత్ తీగలను గమనించకపోవడంతో తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబసభ్యులు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు అతడిని ఆటోలో చికిత్స నిమిత్తం వెల్దుర్తికి తరలించారు. అయితే మార్గమధ్యలో సురేష్ మృతి చెందాడు. మృతదేహానికి వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మాధవి ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

సి.బెళగల్, ఫిబ్రవరి 3: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన శ్రీరా ములు అనే వ్యక్తి శనివారం తెలంగాణ మద్యాన్ని తరలిస్తుండగా ఎస్ఐ మన్మధవిజయ్, సిబ్బందితో కలిసి దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈసంద ర్భంగా ఎస్ఐ మన్మధవిజయ్ మాట్లాడుతూ మండలంలోని కొత్తకోటకు చెందిన శ్రీరాములు తెలంగాణ నుంచి 60 మద్యం బాటిళ్లను తీసుకొని వస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

» ఖాళీ బిందెలతో మహిళల నిరసన
» మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గౌరు చరిత, మహిళలు

కల్లూరు, ఫిబ్రవరి 3: నగర పరిధిలోని 28వ వార్డు పందిపాడులో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలతో కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. శనివారం సాయంత్రం పంది పాడు గ్రామస్థులు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు నిర్వహించిన నిరసనకు టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత మద్దతు తెలిపారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ కార్పొరేషన్‌లో విలీనమైన పందిపాడులో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. గత వారం రోజులుగా పంది పాడులోని బీసీ కాలనీ, దళితవాడ, బీఆర్‌రెడ్డి కాలనీ, రమణ రెసిడెన్సీలలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పాలకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మొక్కుబడిగా కార్పొరేషన్‌లో విలీనం చేశారని, కనీసం వీధిలైట్లు, డ్రైనేజీలు రోడ్లు కూడా వేయలేని దీనస్థితిలో కాలనీలు దర్శనమిస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. కాలనీల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద ఎక్కువైందని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. అనంతరం కమిషనర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, పందిపాడు టీడీపీ నాయకులు శేఖర్‌చౌదరి, అయ్యపురెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం: ఆకెపోగు


మాట్లాడుతున్న ఆకెపోగు ప్రభాకర్

కోడుమూరు, పిబ్రవరి 3: టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం లభిస్తుందని పార్టీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం లో 75 మంది బీసీలను చంపబడ్డారని అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో 2775మంది బీసీలపై అక్రమ కేసులు పెట్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించారని, అయితే జగన్మోహన్‌రెడ్డి రిజర్వేషన్‌ను 24శాతానికి తగ్గించా రని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయంలో కార్పొరేషన్లకు నిధులు కేటాయించి బీసీలను ఆదుకొన్నారు. కానీ ఇప్పుడు వైసీపీ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్రం రామకృష్ణుడు, విజయ్‌కుమార్ తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సీబీలత కోడుమూరు, గూడూరు, కర్నూలు టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, గజేంద్రగోపాల్‌నాయుడు, శివశంకర్ మాజీ సర్పంచు కేతు రాం బాబు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఈశ్వరయ్య, చంద్రబోస్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

కార్మికుల హామీలను అమలు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కార్మిక శాఖ కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తరహాలో కార్మికులందరికీ డైరెక్ట్‌గా వేతనాలు చెల్లించాలన్నారు. విద్యుత్ స్టోర్ హమాలీలకు పీస్ రేటు విధానం రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఫిబ్రవరి 8న విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నాయకులు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

● సీపీఐ, రైతు సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు మండలంలో రైతులు వినియోగిస్తున్న బోర్లకు ప్రభుత్వం బలవంతంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయడంతో సీపీఐ అధ్వర్యంలో వాటిని తొలగించామన్నారు. దీంతో 8మంది నాయకులపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు.

విధుల్లోకి డీసీపీ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 3: నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ యు.మోహన్‌కుమార్ తిరిగి విధుల్లోకి చేరారు. అనారోగ్యంతో నెలరోజులు సెలవు కావాలని గత 28న కమిషనర్‌కు సెలవు లేఖ పంపారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఆయన సెలవును తిరస్కరిస్తూ కమిషనర్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో డీసీపీ ఎన్నికల విధులు, కోర్టు కేసులు, ఆర్‌డీపీఎస్ ప్రిపరేషన్ చేయాలని ఉండటంతో సెలవును తిరస్కరించారు. తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

అడ్వాణీకి భారతరత్నపై హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3: ఎల్‌కే అడ్వాణీకి భారతరత్న అవార్డుకు ఎంపిక కావడం పట్ల భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ శనివారం హర్షం వ్యక్తం చేసింది. అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టి, ప్రజల మన్ననలను పొందారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్.నీలకంఠ, జిల్లా మీడియా ప్రతినిధి పీకే సాయిప్రదీప్ అన్నారు. భారతరత్న అవార్డుకు ఎల్‌కే అడ్వాణీకి ఎంపిక కావడం దేశానికే గర్వకారణమని కొనియాడారు.

వైసీపీలో వర్గ విభేదాలు

- కార్యక్రమానికి పిలవలేదని ఆగ్రహించిన మార్కెట్ యార్డు చైర్మన్
- సమాచారం ఇవ్వకుండా మండల కన్వీనర్‌ను తొలగించారని ఆరోపణ
- నియోజకవర్గ సమావేశానికి మంత్రి జయరాం గైర్హాజరు


మాట్లాడుతున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

ఆలూరు, ఫిబ్రవరి 3: ఆలూరు నియోజకవర్గ వైసీపీలో మంత్రి జయరాం, ఆలూరు వైసీపీ ఇన్‌చార్జి విరూపాక్షికి మధ్య వర్గ విభేదాలతో క్యాడర్‌లో తీవ్ర అయోమయం నెలకొంది. ఆలూరులో శనివారం జగన్ కోసం.....నేను సిద్ధం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీవై రామయ్య హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి మంత్రి జయరాం, ఆయన సోదరులు ఆలూరు, హాలహర్వి దేవనకొండ మండలాల జడ్పీటీసీలు ఏలూరు శేఖర్, కిట్టు లింగప్ప హాజరు కాకపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వైసీపీ అధిష్ఠానం మంత్రి జయరాంను కర్నూలు పార్లమెంట్ స్థానంలో పోటీ చేయాలని ప్రకటించింది. చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షిని ఆలూరు వైసీపీ సమన్వయ కర్తగా నియమించడంతో మంత్రి గత 15 రోజులుగా అందుబాటులో లేరు. మంత్రిని కలిసేందుకు విరుపాక్షి ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు. పార్టీ కార్యక్రమాలకు కూడా హాజరు కాలేదు. విరుపాక్షి మంత్రి జయరాం అనుచరులనే కారణంగా కార్యక్రమాలకు పిలవడం లేదని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. పార్టీలో వర్గ విభేదాలకు విరుపాక్షి తెరతీస్తున్నాడని, ఇంకా బీఫాం రాలేదని, మార్పులు జరగవచ్చని ఆయన అన్నారు. ఏదేమైనప్పటికీ ఎన్నికలు జరగకముందే ఆలూరు వైసీపీ రెండుగా చీలిపోయింది. ఎవరు, ఎటు వెళ్లాలో తెలియని అయోమయంలో కేడర్ పడిపోయింది. మరోవైపు మంత్రి అనుచరులు మాత్రం మూడు రోజుల్లో అధిష్ఠానం శుభవార్త చెబుతుందని, జయరాం ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నారని అంటున్నారు.

పేదలందరికీ వైద్య సేవలు

తుగ్గలి, ఫిబ్రవరి 3: ప్రతి పేదవానికి గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు రైతులకు అన్ని రకాల ఎరువులు, విత్తనాలు గ్రామంలోనే అందిస్తామని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శనివారం బొందిమడుగులలో దాదాపు 44 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన రైతుభరోసా, హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ కుమార్, ఏవో పవన్ కుమార్, గోపాల్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మునిరెడ్డి, ఎంపీటీసీ సుంకన్న పాల్గొన్నారు.

ఓపీఎస్ ఇచ్చే వారికే ఉద్యోగుల ఓటు


ఓట్ ఫర్ ఓపీఎస్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 3: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే పార్టీకే రానున్న ఎన్నికల్లో ఉద్యోగులందరూ ఓటు వేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప పేర్కొన్నారు. శనివారం శనివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఓట్ పర్ ఓపీఎస్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, సీనియర్ నాయకులు పాపయ్య, పెద్దయ్య సునీల్ రాజ్ కుమార్, మల్లయ్య, నరసయ్య గౌడ్, రంగన్న, సుధాకర్, రాముడు, లింగన్న, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేష్, పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నందవరం, ఫిబ్రవరి 3: సీపీఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కారదర్శి విజేయేంద్ర డిమాండ్ చేశారు. శనివారం నందవరంలో వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలో రైతులు వినియోగిస్తున్న బోర్లకు ప్రభుత్వం బలవంతగా విద్యుత్ మీటర్లను అమర్చిందని, వాటిని తొలగించినందుకు సీపీఐ నాయకులపై కేసులు పెట్టడం సబబు కాదన్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం జగన్ నీరుగారుస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రజల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్లు

మద్దికెర, ఫిబ్రవరి 3 : మద్దికెరలోని 3వ సచివాలయంలో ప్రజల సౌకర్యార్థం ఇంటి పత్రాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. శనివారం గ్రామంలోని 3వ సచివాలయంలో మహాలక్ష్మి అనే మహిళకు ఇంటి పత్రాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రంగస్వామి, హర్షవర్ధన్, పంచాయితీ కార్యదర్శి కరణ కుమారి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ మీటర్లు బిగించడం దారుణం

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య


మాట్లాడుతున్న గిడ్డయ్య

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచారని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు మండలం కలగట్లలో రైతు పొలాల్లో అధికారులు మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తుండడంతో రైతు సంఘం నాయకులు వాటిని తొలగించడంతో వారిపై అక్రమ కేసులు పెట్టారని, తక్షణమే కేసులను కొట్టివేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వల్ల రైతులపై మోయలేని భారం పడిందన్నారు.

కేసులకు భయపడం : సీపీఐ

ఎమ్మిగనూరు రూరల్: విద్యుత్ మోటార్లకు మీటర్లను బిగించవద్దని అడ్డుకుంటే తమపై అక్రమ కేసులు పెట్టారని, అయితే భయపడేది లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజీవ్, వీరేష్, ముక్తార్, విజయేంద్ర, మల్లికార్జున గౌడ్, సుంకన్న, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, ఫిబ్రవరి 3: ప్రభుత్వం ప్రటించిన మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ అని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 5,50,892 ఖాళీలు ఉంటే, కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడమేనని అన్నారు. డీఎస్సీ పేరుతో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెర తీశాన్నారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్ రెడ్డి, ఈ ఐదేళ్లలో చేసింది ఏమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించింది. ఇప్పుడు జగన్ రెడ్డి కేవలం 6,100 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లేలా కల్లబొల్లి మాటలు చెప్తున్నారని, ఎన్నికల హామీల్లో భాగంగా చేసిన, ఏటా మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ నిర్వాకంతో దేశవ్యాప్తంగా 11 శాతం నిరుద్యోగం ఉంటే ఏపీలో 24 శాతం ఉందన్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్రప్రదేశ్‌గా.. గంజాయి ఉత్పత్తిలో నెంబర్ వన్‌గా రాష్ట్రాన్ని చేసి గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేని జగన్ రెడ్డి చేతకానితనంలో రాష్ట్రవ్యాప్తంగా 1,745 మంది యువత బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్నదని, గంజాయి మత్తులో పడి యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. జగన్ సభ కోసం విద్యార్థుల పరీక్షను వాయిదా వేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థులకు జగన్ మామ కాదు... సైకో మామ అని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

యువతను మోసం చేసేందుకే..

తుగ్గలి, ఫిబ్రవరి 3: యువతను మోసం చేసేందుకే జగన్ డీఎస్సీ డ్రామా ఆడుతున్నారని, యువత మోసపోకండని టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యప్రకాష్ అన్నారు. శనివారం తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50వేలకు పైగా టీచరు పోస్టులు ఖాళీగా ఉండగా.. కేవలం 6,100 పోస్టులు మాత్రమే విడుదల చేసి మెగా డీఎస్సీ అని డప్పు కొట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఇలా మోసపూరితమైన డీఎస్సీలను విడుదల చేస్తున్నారని, దీనిని ఎవరూ నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టీడీపీ విజయాన్ని ఆపలేరు: బీవీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, ఫిబ్రవరి 3: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఏపీలో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం కులుమాల గ్రామంలో బీవీ పర్యటించారు. గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు, నిరుద్యోగులకు, యువతకు మహిళలకు చేసే అభివృద్ధి పనులను గురించి వారికి వివరించారు. బీవీ మాట్లాడుతూ వైసీపీ ఎంత మందిని ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినా టీడీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ఎమ్మిగనూరులో నెలలోనే ఇద్దరు అభ్యర్థులను మార్చారన్నారు. ఇక ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన కుమారుని పని అయిపోయినట్లేనని అన్నారు. ఈ సీఎం జగన్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమైందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అయినప్పటికి సమస్యను పరిష్కరించేందుకు అధికార పార్టీ నాయకులు ముందుకు రాకపోవడం దారుణం అన్నారు. రైతులకు వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకుగాను టీడీపీ హయాంలో ఎంవీఎస్ స్కీం ప్రకటించి రూ. 13.50 కోట్ల నిధులకు కూడా విడుదల చేశామని, అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులను నిలిచిపోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆపనులను పూర్తి చేసి గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, కులుమాల రాముడు, చాంద్‌బాషా, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రంగస్వామినాయుడు, రాంపురం రఫీక్, రమేష్‌నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేయాలి


నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దళిత సంఘం నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 3: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల బాలుస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జైభీమ్ సాయిరాం కోరారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆర్ దేవిప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఎరుకల రవికుమార్, టీ దేవదాసులను దళిత సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను, అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమస్యలపై పోరాడుతామన్నారు. అంబేద్కర్ కల్పించిన హక్కులను ప్రతిఒక్కరికీ అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బొబ్బిలి వీరేష్, కల్లుబోతుల రవి, మణికంఠ, లక్ష్మణ, కృష్ణకాంత్, రామ్ నాయుడు, రమేష్, నాగరాజు, నీలకంఠ పాల్గొన్నారు.

అర్చకులకు శిక్షణా తరగతులు

మంత్రాలయం, ఫిబ్రవరి 3: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం సహకారంతో గురు రాజాంగణ భవనంలో అర్చకులకు 5, 6 తేదీల్లో శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఏపీ అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌తోపాటు మరో ముగ్గురు వివిధ దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు, పండితులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దాదాపు 150 మంది అర్చకులు పాల్గొంటారని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అర్చకులు మాట్లాడి ఆశీస్సులు అందజేస్తారన్నారు. ఇందు కోసం పీఠాధిపతి ఆదేశాల మేరకు వసతి భోజనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని కోసం వాఘిరాజాచార్, శ్రీపతాచార్‌లు పాల్గొంటారని అన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తూ వైసీపీ ప్రచారం

ఆదోని, ఫిబ్రవరి 3: ఆదోని పట్టణంలోని వాల్మీకి నగర్‌లో శనివారం పింఛన్‌దారులకు వైసీపీ నాయకులు, గృహ సారథులు పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్ ఇస్తూ.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. వలంటరీ వ్యవస్థ ఉన్నప్పటికీ, వారిని పక్కన పెట్టి నాయకులే నేరుగా వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ఓటు వేయకుంటే పింఛన్ రద్దు చేస్తామని హెచ్చరిస్తూ ప్రచారం చేస్తున్నారు. కొందరు పింఛన్లుదారులు ఇదేంటని నాయకులను ప్రశ్నిస్తున్నారు. విషయంపై కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పింఛన్లను వలంటరీ మాత్రమే పంపిణీ చేయాలని, వేరే వ్యక్తులు పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విరాళమిచ్చిన యాచకురాలు


విరాళం అందజేస్తున్న యాచకురాలు

ఆలూరు, ఫిబ్రవరి 3: ఆలూరు శివారులోని హనుమాన్ సర్కిల్‌లో నిర్మిస్తున్న 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ స్థాపన కోసం యచకురాలు సుంకులమ్మ రూ.5116 ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందించారు. గతంలోను సాయిబాబా ఆలయ నిర్మాణం కోసం ఆమె రూ.18 వేలు విలువ గల వెండి వస్తువులను సమర్పించిందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యాచకురాలు సుంకులమ్మను అభినందించారు.

లోకాయుక్తను ఆశ్రయించిన గ్రామస్థులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : ఆదోని మండలం మదిరె గ్రామస్థులు లోకాయుక్తను ఆశ్రయించారు. గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని పలుమార్లు మండల, జిల్లా అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన కృష్ణతోపాటు మరికొందరు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో స్పందించిన లోకాయుక్త 4వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, అలాగే హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించింది.

పాత పెన్షన్ పునరుద్ధరించే పార్టీకే మద్దతు


కరపత్రాలను చూపుతున్న యూటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకే యూటీఎఫ్ మద్దతు ఉంటుందని సంఘం నాయకులు తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మిగనూరు రూరల్ అండ్ అర్బన్ శాఖల ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎల్లప్ప, దావిద్, నాగమణిలు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యమైందన్నారు. ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్, లతీఫ్, రాజు, అల్లాబకాష్, గుమ్మల బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


మంత్రాలయంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మంత్రాలయం, ఫిబ్రవరి 3: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సర్కిల్‌లో ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు ఎన్నికల దృష్ట్యా ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డబ్బు, మారణాయుధాలు, కర్ణాటక మద్యం సరఫరాపై దృష్టి సారిస్తూ అనుమానం ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో రోడ్డు టాక్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సు, పర్మిట్ లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలో ఏఎస్‌ఐ ఆనంద రెడ్డి, కృష్ణయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

వెల్దుర్తి, ఫిబ్రవరి 3: పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ శివరాముడుకు రెవెన్యూ సిబ్బంది ఘన సన్మానించారు. ఈయన చేసిన సేవలకు రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ సృజన చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఎన్నికల బదిలీలలో భాగంగా చిత్తూరు జిల్లా పూసలపట్టు మండలానికి బదిలీ అయ్యారు.

వేలం రద్దు చేయాలని వినతి


ఆర్డీవో కార్యాలయం వద్ద అధికారులతో వాగ్వాదం చేస్తున్న పందికోన గ్రామస్తులు

పత్తికొండ, ఫిబ్రవరి 3 : పందికోన రిజర్వాయర్‌లో చేపల వేలాలకు సంబంధించి మత్స్యశాఖ అధికారులకు పందికోన గ్రామస్తుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం రిజర్వాయర్ చేపల వేలాలకు సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో విచారణకు మత్స్యశాఖ అధికారులు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న పందికోన గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వేలాలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో అధికారులు, గ్రామస్తులు వెళ్లిపోయారు. కాగా నిబంధనల మేరకే వేలాలు నిర్వహించామని అధికారులకు వేలాలపై నివేదికలు అందిస్తామని మత్స్యశాఖ అధికారి చంద్రయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు.

విధుల్లోకి చేరిన ఎంపీడీఓలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 3: పత్తికొండ మండల ప్రజాపరిషత్ నూతన అధికారిగా డీ రామారావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న కవితను వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఎంపీపీ నారాయణ దాసు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మద్దికెర: ఎంపీడీవోగా అలివేలమ్మ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. మద్దికెరలో పని చేస్తున్న నరసింహమూర్తిని అనంతపురం జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన అలివేలమ్మ బాధ్యతలు చేపట్టారు.

గోనెగండ్ల: గోనెగండ్ల ఎంపీడీవోగా సోనుబాయి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆస్పరి: ఆస్పరి ఎంపీడీవోగా లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోల బదిలీ ప్రక్రియలో భాగంగా అనంతపురం జిల్లా యాడికి ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయన, బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నందవరం: నందవరం ఎంపీడీవోగా కిరణకుమార్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా సత్యాసాయి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో దశరథరామయ్య కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు.

వెల్దుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవోగా ఎన్.శివశంకరప్ప నూతన బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా అనంతపురం జిల్లా పెనుగొండ మండలం నుంచి వెల్దుర్తికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు అనంతపురం జిల్లా పామిడికి బదిలీపై వెళ్లారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

దేవనకొండ, ఫిబ్రవరి 3: మండలంలోని కె.వెంకటాపురం 1,మాచాపురం 1 గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆస్పరి సీడీపీవో నిర్మలమ్మ, సూపర్‌వైజర్ సునీతమ్మ తెలిపారు. దరకాస్తు చేసుకునే అభ్యర్థులు 7వ తరగతిలో ఉత్తీర్ణులై , వయసు 21 సంవత్సరాలు పైబడి ,తప్పనిసరిగా వివాహితురాలై, స్థానికంగానే ఉండాలన్నారు. 7న సాయంత్రం 5 లోగా సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ప్రజలు సహకరించాలి

దేవనకొండ, ఫిబ్రవరి 3: త్వరలో జరిగే ఎన్నికలకు ప్రజలు సహకరించాలని సీఐ కె.శ్రీనివాసులు కోరారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం మండలంలోని బండపల్లి ,బేతపల్లి, చెల్లెచెలిమల, బంటుపల్లి, గుడిమిరాళ్ల గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మాచాపురం గ్రామానికి చెందిన ఎరుకల వెంకటేష్ అక్రమంగా నాటుసారా తయారు చేస్తుండగా పట్టుకొని, అరెస్టు చేసినట్లు తెలిపారు.

రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పించాలి


నిరసనను తెలియజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : విశాఖ జిల్లా కొప్పాడ తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడం దారుణమని రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్‌రెడ్డి, కార్యదర్శి వలిబాషలు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ దారుణ హత్యను నిరసిస్తూ, శనివారం రెవెన్యూ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెవిన్యూ సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, హత్య చేసిన దుండగులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ జయరామిరెడ్డి, వీఆర్‌వోల సంఘం డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఈరన్న, కాశీం, ప్రకాష్, జమీర్, వీరాంజి, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి


కళాకారులను సన్మానిస్తున్న తలారి పరశురాం

మద్దికెర,చిప్పగిరి, ఫిబ్రవరి 3 : కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ వ్యవస్థాపకులు తలారి పరశురాముడు, ఆలయ కమిటీ గౌరవసభ్యులు రిటైర్డు తహసీల్దార్ వెంకటచలపతి అన్నారు. శనివారం మద్దికెర, కసాపురం గ్రామ శివారుల మధ్య రూ.2 కోట్లతో నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో జానపద గురువులను, భజన బృందం సభ్యులకు సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ అనంతపురం, కర్నూలు, సత్యసాయి జిల్లాల నుంచి కళాకారులు వచ్చారని, కళలు అంతరించిపోకుండా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. 18 నుంచి మూడు రోజుల పాటు లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రారంభ పనులు ఉంటాయన్నారు. 22న లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ చిన్న జీయరు స్వామి చేతుల మీదుగా ఘనంగా జరుగుతుందన్నారు.

నేడు పందికోన అయ్యన్న వర్ధంతి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 3: పందికోన మాజీ ఎంపీటీసీ మెంబర్, సీపీఐ మాజీ మండల కార్యదర్శి అయ్యన్న వర్ధంతి వేడుకలు ఆదివారం పందికోనలో నిర్వహిస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు గ్రామంలో నిర్మించిన అయ్యన్న స్థూపం దగ్గర వర్ధంతి వేడుకలకు నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలను పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన బుడగ జంగాల కాలనీకి చెందిన రాముడు బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బసవరాజు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

నేడు జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

మద్దికెర, ఫిబ్రవరి 3 : మద్దికెర గ్రామంలోని విద్యాసాయి పాఠశాలలో ఆదివారం అండర్-23 జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా సూపర్-7 క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల కోసం ఈ సెలక్షన్లు నిర్వహించబడుతాయనీ, ఈ అవకాశాన్ని 23 సంవత్సరాలోపు వయసు గల బాలురు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపికైన వారిని క్రికెట్ జట్టులో ఆడే అవకాశం జరుగుతుందన్నారు.

రూ.10 లక్షలకు పెంచాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 3: న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ నుంచి డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కార్యవర్గ సభ్యులు సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ స్టాంపులు ఉన్నప్పుడు రూ.4 లక్షలు బెనిఫిట్స్ ఇస్తున్నారని, ఈసారి ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో రూ.100 ఉన్న వెల్ఫేర్ ఫండ్‌ను రూ.225కు పెంచారని, అయితే.. డెత్ బెనిఫిట్స్ మాత్రం రూ.4 నుంచి 5 లక్షలకు పెంచడం సరికాదని.. ఈ బెనిఫిట్స్‌ను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.